ఏ క్షణంలోనైనా తన ప్రాణాలు పోతాయని తెలిసి దుర్భరమైన మానసిక వేదనను అనుభవిస్తున్న వ్యక్తి అసలింతకీ ఏం చేశాడు? అతని బలహీనత అతనికి, అతని కుటుంబానికీ ఎలా శాపంగా పరిణమించింది?

ఎంతో తెల్లగా, శుభ్రంగా ఉన్న గోడమీద ఎవరో ఎర్ర సిరాతో 'హెచ్' అనే అక్షరాన్ని రాశారు. ఇది బహుశా పెద్దదాని పనే అయ్యుంటుంది. ఆ అక్షరంకేసి ఇదివరకు చాలాసార్లే చూశాడు. తన పేరు హనుమంత రావు కాబట్టి, పెద్దది ఆ అక్షరాన్ని అలా అందంగా రాసి ఉంటుందను కున్నాడు. కానీ, ఇప్పుడా అక్షరం తనకు అందంగా కనిపించడం లేదు. ఈ క్షణంలో ఆ అక్షరం తనకు చాలా భయంకరంగా కనిపిస్తోంది.

కణకణ మండుతున్న నిప్పు కణికలా, స్ట్రెచర్‌మీద పడుకోబెట్టిన రోగి కక్కుతున్న రక్తంలా, తన గొంతు నులిమేసే బలమైన రెండు ఉక్కు హస్తాల్లా దర్శనమిస్తోందా అక్షరం. తన ఇంటి నిండా హెచ్చె. తన పేరు హనుమంతరావు. తన భార్య పేరు హేమలత. తన నాలుగేళ్ళ పెద్ద కూతురు పేరు హరిత. తన మూడు నెలల పాప పేరు హరిణి. తాను పనిచేసేది హైదరాబాద్ యూనివర్సిటీలో. తాను హిస్టరీలో ప్రొఫెసర్!

బట్టలు మార్చుకోకుండానే బెడ్‌మీద పడిపోయాడు. సాయంత్రం ఆరవుతోంది. హేమ పాపకు ఇంజెక్షన్ ఇప్పించడానికి డాక్టర్ దగ్గరకు వెళ్తున్నానని తనకు ఫోన్ చేసి చెప్పింది. తన దగ్గరున్న డూప్లికేట్ కీస్‌తో తలుపులు తెరచుకొని ఇంట్లో ప్రవేశించాడు. ఈరోజు తన ఇల్లే తనకు కొత్తగా కనిపిస్తోంది. ఏదో జైల్లో ప్రవేశించినట్లుగా... ఈ జైల్లోనే త్వరలోనే తనను ఉరితీయబోతున్నట్లుగా ఫీలయ్యాడు. అకస్మాత్తుగా అతని లోపలెక్కడో వణకు ప్రారంభమైంది. కడుపులో ప్రారంభమైన వణకు శరీరమంతా వ్యాపిస్తోంది. చలికాలంలోలా అతడు వణకిపోతున్నాడు. భయం అతన్ని ఆక్రమించుకుంటోంది. అతని నిలువెల్లా భయం. అతని శరీరంలోని ప్రతి అణువులోనూ భయం ప్రవేశించింది. బెడ్ మీదున్న రగ్ తీసి నిండా కప్పుకున్నాడు. ఇదేమిటి? తానిలా వణకిపోతున్నాడేమిటి? నడి వేసవిలో తనకీ వణకేమిటి? బలికి తీసుకుపోబడుతున్న మేకపిల్లలా వణకిపోతున్నాడతడు. అలా వణకిపోతూనే బెడ్డంతా దొర్లుతున్నాడు. ఉంగలు చుట్టుకుపోతున్నాడు.

ఏ క్షణంలోనైనా తన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతాయి. కనీసం హేమ వచ్చేంతవరకైనా తన ప్రాణాల్ని నిలుపుకోలేడు. మేనమామల ఇంటికెళ్ళిన హరితనైతే తానీ జన్మలో మళ్ళీ చూడలేడు.

నిండా రగ్గు కప్పుకోవడంతో అతని శరీరమంతా చెమట పట్టేసింది. రగ్గు తీసేశాడు. తనను తాను ఓదార్చుకోవడానికి ప్రయత్నించాడు. అసలా రిపోర్టు తనది కానే కాదు. అంతా మోసం. ఎవరి రిపోర్టు మీదో తన పేరు పడిపోయింది. నోనోనో... తనను తాను మోసగించుకోవడానికి ప్రయత్నించి ప్రయోజనం లేదు. ఆ రిపోర్టు తనదే. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకున్నాడు. రెండుసార్లు పరీక్ష చేయించుకున్నాడు. ఆ డాక్టర్ కూడా తనకు బాగా తెలిసినవాడే. తననతడు మోసం చేసే ప్రసక్తే లేదు.

అసలిదంతా ఎలా జరిగింది. పోయిన వేసవికాలంలో తాను ఢిల్లీ వెళ్ళాడు. అందమైన న్యూఢిల్లీ. అందమైన విజ్ఞానభవన్. వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్. ప్రపంచంలోని హిస్టరీ పండితులందరూ వచ్చారు. ఆరోజు జరిగే సెమినార్‌లో తాను పేపర్ ప్రెజంట్ చెయ్యాలి. తనా పేపర్‌ను హోటల్ రూమ్‌లో మరచిపోయాడు. "హల్లో ప్రొఫెసర్‌గారూ. ఎటూ చూడకుండా ఎక్కడికలా హడావిడిగా వెళ్ళిపోతున్నారు" అంది ప్రొఫెసర్ రమణి నిజంగానే హడావిడిగా వెళ్తున్న తనను ఆపి.

"సారీ, మీరా? నేను గమనించనే లేదు" అన్నాడు తాను.

"నేను మీరాను కాను రమణిని" అందామె అందంగా నవ్వుతూ.

"అఫ్‌కోర్స్! నువ్వు రమణివే. హౌ ఆర్ యూ రమణి" అన్నాడు తాను.

"ఫైన్. ఎక్కడికలా పరిగెత్తుతున్నారు" అంది రమణి.

"నెక్స్ట్ సెషన్‌లో మొదటి పేపర్ ప్రెజంట్ చెయ్యాల్సింది నేనే. తీరా చూస్తే బ్యాగ్‌లో పేపర్ లేదు. హోటల్ నుంచి బయటకెళ్తున్నప్పుడు బ్యాగ్‌లో ఆ పేపర్ పెట్టుకున్నాననుకున్నాను. కానీ, ఆ పేపర్‌ను నేను నా రూమ్‌లోనే మరచిపోయినట్టున్నాను. ఇప్పుడు హోటల్ దాకా వెళ్ళి పట్టుకురావాలి."

"ప్రొఫెసర్ల మీద జనం చెప్పుకునే జోక్స్‌ని నిజం చేశారు. మీరే హోటల్లో దిగారు?"

"నదరన్ హోటల్లో. కరోల్‌బాగ్."

"నేనూ ఆ హోటల్లోనే దిగాను."

"మీ రూమ్ నంబరెంత?"

"టూ నాట్ వన్."

"వాట్ ఎ కో ఇన్సిడెన్స్. నేను టూ నాట్ టులో దిగాను. మనిద్దరికీ ఇదివరకు త్రివేంద్రంలో కూడా ఇలాగే జరిగింది."

"బర్డ్స్ ఆఫ్ ది సేమ్ ఫెదర్ ఫ్లాక్ టుగెదర్ అని ఊరికే అన్నారా?"

"అయితే, మీ పేపరెప్పుడుంది?"

రేపు మార్నింగ్ సెషన్‌లో. నేను ఈరోజే మార్నింగ్ ఫ్లైట్‌లో బాంబే నుంచి వచ్చాను. మీకు టైమెక్కువ లేదు. వెళ్ళి పేపర్ తెచ్చుకోండి. తర్వాత తీరికగా మాట్లాడుకుందాం. మన ఆబ్సెంట్ మైండెడ్ నెస్‌కు ఈమాత్రం ఫైన్ చెల్లించక తప్పదు మరి" అంది రమణి.

రమణి తెల్లగా, పొడుగ్గా, బాబ్డ్ హేర్‌తో పంజాబీ డ్రస్‌లో చాలా అందంగా కనిపించింది. వాళ్ళ హజ్బెండ్ సౌదీ అరేబియాలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలలకో, మూడు నెలలకో ఒకసారొచ్చి ఈమెతో ఓ వారం పది రోజులు గడిపిపోతుంటాడు. ఇంత అందమైన భార్యను ఇండియాలో వదిలేసి అతడు సౌదీకి వెళ్ళిపోవడం ఆశ్చర్యమే. తానైతే తన భార్యను విడిచి ఓ పది రోజులు కూడా ఉండలేడు.

రమణివాళ్ళు తెలుగువాళ్ళే. ఇదివరకు త్రివేంద్రంలో జరిగిన హిస్టరీ కాంగ్రెస్‌లో పరిచయమైందామె. పక్కపక్కనే రూమ్స్ కావడంవల్ల ఇద్దరూ ఫ్రెండ్సయిపోయారు. ఆమెను మళ్ళీ ఢిల్లీలో కలుసుకోవడం తనకి గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. తన పేపర్ రూమ్‌లోనే ఉంది. ఆరోజు తాను ప్రెజంట్ చేసిన పేపర్‌కు చాలా గొప్ప రెస్పాన్స్ వచ్చింది. విజ్ఞాన భవనంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది. సమావేశం అయిపోగానే రమణి తన దగరకొచ్చి "కంగ్రాచ్యులేషన్స్ ప్రొఫెసర్! మీ పేపర్ చాలా బావుంది" అంది.

"థ్యాంక్స్" అన్నాడు తాను.

"యువర్ పేపర్ కంటెయిన్స్ సమ్ ఒరిజినల్ ఐడియాస్. ఇదివరకెవరూ ఇండో ఆర్యన్స్‌ను గూర్చి ఇన్ని కొత్త విషయాలు చెప్పలేదు. యూ వర్ సింప్లీ బ్రిలియంట్" అంది రమణి.

"థ్యాంక్స్" అన్నాడు తాను మళ్ళీ.

"యూ ఆర్ యంగ్ అండ్ బ్రిలియంట్. అయామ్ జెలస్ ఆఫ్ యూ."

"అయామాల్సో జెలస్ ఆఫ్ యూ" అన్నాడు తాను.

"ఎందుకు?"

చిత్రాలు:నర్సిం



"యూ ఆర్ ఆల్సో యంగ్ అండ్ బ్రిలియంట్. మీ మెడలో మెరుస్తున్న వజ్రాల నెక్లెస్‌ను చూస్తే ఎవరికైనా ఈర్ష్య కలుగుతుంది. ఐ విష్ ఐ కుడ్ ప్రెజెంట్ వన్ సచ్ నెక్లెస్ టు మై వైఫ్" అన్నాడు తాను.

"ఓ రియల్లీ! యూ రియల్లీ లవ్ యువర్ వైఫ్ సో మచ్!"

"యా! ఐ రియల్లీ లవ్ మై వైఫ్! షీ ఈజ్ సచ్ ఏన్ ఏంజెల్!"

"ఐ విష్ ఐ కుడ్ సీ యువర్ ఏంజెల్!"

ఇలా మాట్లాడుకుంటూనే ఇద్దరూ ఒకే కార్లో హోటల్ చేరుకున్నారు. "డిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్. అతని పేరు వర్మ అనుకుంటాను. అతని ఆర్గ్యుమెంట్ చూశారా? ఎంత స్ట్రేంజ్‌గా ఉందో" అన్నాడు తాను కార్లోంచి దిగుతూ.

"స్టుపిడ్. హీ ఈజ్ ఎ స్టుపిడ్ ఫెలో. వాడి మొహంలాగే వాడి పేపర్" అంది రమణి తానూ కార్లోంచి దిగుతూ.

"పైగా వాడికి పెద్ద పోజు. నా అంతటివాడు లేడనుకుంటాడు. డిల్లీలో ఉండడం అతనికి చాలా లాభమైంది. ఎన్ని యు.జి.సి ప్రాజెక్ట్స్ తెచ్చుకున్నాడో."

"నార్త్‌లో ఉన్నవాళ్ళందరికీ ఈ ఎడ్వాన్‌టేజ్ ఉంది. యు.జి.సి ప్రాజెక్ట్స్ అన్నీ వాళ్ళకే."

ఇలా అనేక విషయాలు మాట్లాడుకుంటూ ఇద్దరూ పక్క పక్కనే ఉన్న తమ రూమ్స్‌కు చేరారు. తాను తన రూమ్‌లోకి, ఆమె ఆమె రూమ్‌లోకి వెళ్ళిపోయారు.

తాను బట్టలు మార్చుకొని, స్నానం చేసి కాసేపు రిలాక్సయ్యాడు. రాత్రి ఎనిమిది గంటలు దాటింది. రేపటి ప్రోగ్రామ్స్‌ని గురించి ఆలోచిస్తున్నాడు. రేపు సాయంత్రానికి హిస్టరీ కాంగ్రెస్ అయిపోతుంది. తనకు ఎల్లుండి ఏ.పి ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ క్లాస్ ఏ.సిలో బెర్త్ రిజర్వ్ చేశారు. తాను ఇంటి నుంచి బయల్దేరి అప్పుడే పది రోజులయింది. జైపూర్ యూనివర్సిటీవాళ్ళు థీసిస్‌లు సబ్మిట్ చేసిన ముగ్గురు రిసర్చ్ స్కాలర్స్‌కి 'వైవా-వోసి' అరేంజ్ చేసి తనను ఎగ్జామినర్‌గా పిల్చారు. జైపూర్ వెళ్ళి ఆ పని పూర్తి చేసుకొని, హిస్టరీ కాంగ్రెస్ అటెండ్ చేయడానికి ఒక రోజు ముందుగానే డిల్లీ చేరుకున్నాడు. ఈ రోజు రమణి తనకు కలవడం, తన పక్క రూమ్‌లోనే ఆమె దిగడం తనకు గొప్ప ప్లెజెంట్ సర్‌ప్రైజ్.

> కణకణ మండుతున్న
> నిప్పు కణికలా,
> స్ట్రెచర్‌మీద రోగి
> కక్కుతున్న రక్తంలా,
> తన గొంతు నులిమేసే
> బలమైన రెండు ఉక్కు
> హస్తాల్లా దర్శన
> మిస్తోందా అక్షరం.

ఈ అయిదేళ్ళలో ఆమెలో పెద్ద మార్పేమీ లేదు. ఇదివరకు చూసినప్పుడు సన్నగా కనిపించింది. ఇప్పుడు కొంచెం లావెక్కింది. ఈ కారణం చేతనే కావచ్చు ఆమె ఇదివరకటి కంటే ఇంకా ఆకర్షణీయంగా కనిపించింది. ఇదివరకు బోన్స్ తప్ప ఆమెలో ఫ్లెష్ అండ్ బ్లడ్ లేవనిపించింది. నౌ షీ ఈజ్ ఫులాఫ్ ఫ్లెష్ అండ్ బ్లడ్. అప్పుడామె మెడలో వజ్రాల నెక్లెస్ లేదు. ఇప్పుడీ వజ్రాల నెక్లెస్ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసింది. తాను తన హేమకు అలాంటి వజ్రాల నెక్లెస్ ప్రెజెంట్ చేయగల్గితే! ఇంపాజిబుల్! తాను తన జన్మలో అంత డబ్బు సంపాదిచలేడు.

బయట ఎవరో తలుపు తడ్తున్న శబ్దం.

"కమిన్" అన్నాడు తాను. రమణి తలుపు తెరచుకొని లోపలకొచ్చింది. దివి నుంచి భువికి దిగివచ్చిన ఊర్వశిలా రమణి... రమణి మీది నుంచి తన చూపుల్ని మరల్చలేకపోయాడు. అప్పుడే స్నానం చేసినట్లుంది. కలోన్ సువాసనలతో తన గదంతా నిండిపోయింది. ఆమె వేసుకున్న నైటీ ఆమె అందాల్ని దాచలేకపోతున్నది.

"ఏం చేస్తున్నారండీ ప్రొఫెసర్‌గారూ" అంటూ వచ్చిందామె.

"ఏమీ చేయడం లేదు. ఇప్పుడు మీరేం చేస్తుంటారా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు తాను.

"అబద్ధం" అందామె.

"ఎందుకలా అంటున్నారు?"

"మీరు నా గురించి ఆలోచిస్తున్నారంటే నేను నమ్మను."

"ఎందుకు?"



"మీరు మీ 'ఏంజెల్' గురించి ఆలోచించకుండా ఈ 'డెవిల్'ను గురించి ఆలోచిస్తున్నారంటే ఎలా నమ్మేది" అందామె హాయిగా నవ్వుతూ.

"నో నో నో, యూ ఆర్ ఆల్సో యాన్ ఏంజెల్."

"యూ రియల్లీ మీనిట్?" అందామె కళ్ళు పెద్దవి చేసి.

"అఫ్‌కోర్స్. ఐ డూ మీనిట్."

ఇద్దరూ నవ్వారు.

"ఏం చేద్దామంటారిప్పుడు? బాగా ఎగ్జాస్టయి పోయాం. హౌ ఎబౌట్ సమ్ రిలాక్సేషన్!"

"మీరొచ్చారుగా! ఇదే రిలాక్సేషన్."

"హౌ ఎబౌట్ ఎ పెగాఫ్ స్కాచ్!"

"ఐ డోన్ట్ మైండ్ ఇఫ్ ఇటీజ్ వన్ పెగ్ ఓన్లీ. పోయినసారి మీరు నాతో కొంచెం ఎక్కువగానే తాగించారు" అన్నాడు తాను. ఆమె దగ్గర ఎప్పుడూ బెస్ట్ అవేలబుల్ స్కాచ్ ఉంటుందని తనకు తెలుసు. వాళ్ళ హజ్బెండ్ తెచ్చిపెడ్తాడని చెప్పింది.

"ఈసారలా జరగదు. మా రూమ్‌కెళ్దాం రండి" అందామె.

"అయామ్ వెయిటింగ్ ఫర్ ఎ కాల్ ఫ్రమ్ హైదరాబాద్."

"ఈజిట్ యువర్ ఏంజెల్ దటీజ్ గోయింగ్ టు కాల్?"

"యా."

"సచ్ ఎ డివోటెడ్ వైఫ్ అండ్ సచ్ ఎ డివోటెడ్ హజ్బెండ్! వెరీ రేర్ కాంబినేషన్. మీ కాల్‌ను మా రూమ్‌కు డైరెక్ట్ చేయమందాం."

"వద్దు. ఇక్కడే కాసేపు వెయిట్ చేద్దాం."

"అయితే ఉండండి. జస్ట్ ఎ మినిట్. ఇప్పుడే వస్తాను" అంటూ ఆమె బయటకు వెళ్ళింది.

ఫూల్! ఆమెననవసరంగా బయటకు పంపిం చావు అనుకున్నాడు తాను. ఆమె ఉన్నంతసేపూ ఎంత హాయిగా ఫీలయ్యాడు. తన పక్కన హేమ ఉంటే ఎంత హాయిగా ఉంటుందో ఆమె ఉన్నంతసేపూ అంత హాయిగా ఉంది.

ఆమె మళ్ళీ వస్తుందా? ఒకవేళ రాకపోతే? తనకంటే ఆయనకు ఎక్కడో ఉన్న ఆయన భార్యే ముఖ్యమనుకొని తన గదిలోనే ఉండిపోతుందేమో. లేదు, లేదు. తనను వెతుక్కుంటూ ఆమె తప్పకుండా వస్తుంది. ఆమె క్కూడా ఈ క్షణంలో తోడు కావాలి. తనలాగే ఆమె కూడా ఒంటరితనంతో కాలిపోతోంది. కాబట్టి తప్పకుండా వస్తుంది. ఒకవేళ రాకపోతే తానే ఆమె గదిలోకెళ్తాడు. ఓ పది నిమిషాల్లోనే ఆమె చేతిలో చిన్న బ్యాగ్‌తో వచ్చేసింది. ఆమె ఆ బ్యాగ్‌లోంచి ఓ అందమైన బాటిల్ తీసింది.

"దిసీజ్ రాయల్ సెల్యూట్. ది బెస్ట్ స్కాచ్ ఇన్ ది వర్ల్డ్. సౌదీ నుంచి మా హజ్బెండ్ తెచ్చారు. నాలుగేళ్ళ తర్వాత మిమ్మల్ని కలుసుకున్నానన్న ఆనందంలో దీన్నిప్పుడు ఓపెన్ చేస్తున్నాను" అంటూ ఆమె ఆ బాటిల్‌ను ఓపెన్ చేసింది. సరిగ్గా అప్పుడే హోటల్ బాయ్ నాలుగు బిస్లెరి సోడా బాటిల్స్ తెచ్చి టీపాయ్ మీద పెట్టేసి వెళ్ళిపోయాడు. ఆమె రెండు గ్లాసుల్లో విస్కీ పోసి సోడాలు కలిపి ఐస్‌క్యూబ్స్ వేసింది. అతని చేతికో గ్లాసిచ్చి తానో గ్లాసు తీసుకొని గ్లాసుల్ని టాస్ చేసి చీర్స్ అంది.

"చీర్స్" అన్నాడు తానూ. ఆమెతో అలా కూర్చొని చల్లని విస్కీ సిప్ చేస్తోంటే గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. స్వర్గం అంటే ఇదే కాబోలుననిపించింది. ఇంతలో ఫోన్ మోగింది.

"హల్లో" అన్నాడు తాను. తాను ఊహించి నట్లుగానే హేమ. "హాయ్ హేమా! హౌ ఆర్ యు డార్లింగ్. జస్ట్ హెల్! వెంటనే రెక్కలు కట్టుకొని నీముందు వాలాలనిపిస్తోంది. అబద్ధం కాదు. నిజం. ఎల్లుండి ఏ.పిలో బయల్దేరుతున్నాను. ఇంకో 48 గంటల్లో నీతో..." నీ కౌగిలిలో అనబోయి రమణి కేసి చూసి ఆగిపోయాడు.



"అబ్బే! రూమ్‌లో ఇంకెవరూ లేరు హేమా! నేనొక్కడినే. ఇప్పుడే కాన్ఫరెన్స్ హాల్ నుంచి వచ్చాను. స్నానం చేసి రిలాక్సవుతున్నాను. ఇంతలో నీ ఫోనొచ్చింది. ఫ్రీగా మాట్లాడడం లేదా? కమాన్ డార్లింగ్... నిన్నట్నుంచీ జ్వరమా? ఎండలో తిరిగారా. మీ సిస్టర్‌తో షాపింగ్ చేశావా? నేనొస్తే నీ జ్వరం పోతుంది. బై. గుడ్ నైట్ డార్లింగ్." తాను ఫోన్ పెట్టేశాడు.

"మీ ఆవిడకు జ్వరమొచ్చిందా? విరహంతో వచ్చిన జ్వరమై ఉంటుంది" అంది రమణి చిలిపిగా తన కళ్ళల్లోకి చూస్తూ.

"ఐ థింక్ సో. నన్ను విడిచి రెండ్రోజులు కూడా ఉండలేదు."

"మీరూ అంతేనా" అందామె.

"అఫ్‌కోర్స్!"

"యూ ఆర్ ది మోస్ట్ ఫెయిత్‌ఫుల్ హజ్బెండ్ ఐ హావ్ ఎవర్ సీన్" అందామె.

"హౌ ఎబౌట్ యువర్ హజ్బెండ్" అన్నాడు తాను ఆమెను ఉడికించాలనే.

"అడగొద్దు. మూడు నెలలకొకసారి భార్యను